www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
అనంతపురము జిల్లా / శ్రీ సత్యసాయి జిల్లా

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది పెద్దారెడ్డే: జేసీ ప్రభాకర్ రెడ్డి



**అనంతపురం,జూన్27.అక్షర టైమ్స్:-** అనంతపురంలోని లక్ష్మీనగర్‌లోని తన నివాసంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి వైఎస్సార్సీపీ నాయకులపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో తన ఇంటిపై కత్తులు, కొడవళ్లతో దాడికి వచ్చి ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది పెద్దారెడ్డేనని ఆరోపించారు. కేతిరెడ్డి హత్య రాజకీయాలకు తెరలేపారని విమర్శిస్తూ, వైఎస్సార్సీపీ నాయకులు గత చరిత్రను తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. గత ప్రభుత్వంలో రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం తన అనుచరుడు పొట్టి రవిపై జిల్లా బహిష్కరణ విధించారని, హైకోర్టు అనుకూల ఉత్తర్వులు వచ్చినప్పటికీ అనంతపురం జిల్లాలోకి అడుగుపెట్టకుండా పోలీసులు అడ్డుకున్నారని పేర్కొన్నారు. తాడిపత్రికి చెందిన సుమారు 300 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలపై 180 కేసులు నమోదు చేశారని, అవన్నీ రాజకీయ వేధింపుల్లో భాగంగానే నమోదు చేసిన కేసులేనని అన్నారు. అప్పటి జిల్లా ఎస్పీ ఫకీరప్ప రాజకీయ కక్షతో తనతో పాటు ప్రస్తుత తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డిని అరెస్టు చేసి జైలుకు పంపించారని ఆరోపించారు. ఆ సమయంలో తాను ప్రశ్నించగా, అమరావతి నుంచి వచ్చిన ఆదేశాల మేరకే చర్యలు తీసుకున్నామని ఎస్పీ చెప్పినట్లు జేసీ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ నేత అనంత వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్యపై కూడా విమర్శలు చేశారు. గతంలో జరిగిన ఘటనలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని, అలాంటి వారు ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం తాడిపత్రి మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు ఏమిటో ప్రజలకు చెప్పాలని సవాల్ విసిరారు. తాను మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత రూ.5కే తాగునీటి సరఫరా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, సోలార్ సదుపాయాల ఏర్పాటు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశామని తెలిపారు.

# డ్రగ్స్ నిర్మూలనలో విశేష సేవలకు రాష్ట్రస్థాయి ప్రసంసంలు

### జిల్లా ఈగల్ సెల్ అధికారికి హనుమంతుకు రాష్ట్ర స్థాయి గుర్తింపు



**పామిడి,జూన్27.అక్షర టైమ్స్:-** మాదకద్రవ్యాల నిర్మూలన, అక్రమ రవాణా నియంత్రణ, యువతలో డ్రగ్స్‌పై అవగాహన కల్పించడం, డ్రగ్ వ్యతిరేక కార్యక్రమాల నిర్వహణలో విశేష సేవలు అందించిన అనంతపురం జిల్లా ఈగల్ సెల్ అధికారి బి.హనుమంతు రాష్ట్ర స్థాయి ప్రశంసలు అందుకున్నారు. రాష్ట్ర ఈగల్ సెల్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత హనుమంతుని ప్రశంసిస్తూ ఆమె చేతుల మీదుగా బి.హనుమంతుకు ప్రశంసా పత్రంతో పాటు ఈగల్ ప్రత్యేక అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఈగల్ ఐజీపీ మాట్లాడుతూ ఎస్పై బాలగాని హనుమంతు సేవలను అభినందించారు. ఇదే స్ఫూర్తితో మాదకద్రవ్యాల నిర్మూలన, అక్రమ రవాణా నియంత్రణలో మరింత సమర్థవంతంగా పనిచేసి యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడేందుకు కృషి కొనసాగించాలని సూచించారు. అనంతపురం జిల్లాలో పాఠశాలలు, కళాశాలలు, పరిశ్రమలు, గ్రామాలు, ప్రజా ప్రదేశాల్లో డ్రగ్స్ దుష్పరిణామాలపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, మాదకద్రవ్యాల నిర్మూలనకు విశేషంగా కృషి చేస్తున్న బి. హనుమంతుకు రాష్ట్ర స్థాయి గుర్తింపు రావడం జిల్లాకు గర్వకారణమని జిల్లా అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ అవార్డు జిల్లాలో డ్రగ్స్ నిర్మూలన కోసం పనిచేస్తున్న ఈగల్ సెల్ సిబ్బందికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని అధికారులు పేర్కొన్నారు.

# జూన్ 30 'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలి: రైతు సంఘం



**పుట్లూరు,జూన్27.అక్షర టైమ్స్:-** రైతాంగ సమస్యల పరిష్కారం కోసం జూన్ 30న నిర్వహించే 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ పుట్లూరు మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వి.టి. రామాంజనేయులు మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ, బకాయి ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు, రైతులకు పెన్షన్ తదితర డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న 'చలో విజయవాడ' కార్యక్రమానికి పుట్లూరు మండలం నుంచి రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# పీర్ల స్వాములు అగ్నిగుండ ప్రవేశం చేశాయి



**పామిడి,జూన్27.అక్షర టైమ్స్:-** పీర్ల పండుగ సందర్భంగా 10వ.రోజు పలు మఖానాల ఎదుట గల అగ్నిగుండంలలో పీర్ల స్వాములు ప్రవేశించాయి. పీర్ల స్వాములను నూతన వస్త్రాలు ముక్కుబడుల నగలు పూలతో అంగరంగ వైభవంగా అలంకరించారు. ముల్లా షాబులు రాత్రి నుండి ఉదయం వరకు భక్తులకు దర్శన భాగ్యం కలిగించి మొక్కుల చెల్లింపుల కార్యక్రమాన్ని నిర్వహించి అగ్నిగుండ ప్రవేశం చేయించారు. అనంతరం మైన్ బజార్లో 11 మఖానాల పీర్లు సలాం చేసుకున్నాయి. వందలాది భక్తాదులు భక్తి భావాలతో ఆల్ బీదాయే పాట పాడుతూ సాగనంపారు.

# రూ.25 వేల జరిమానా విధించిన లీగల్ మెట్రాలజీ శాఖ



**రాయదుర్గం,జూన్27.అక్షర టైమ్స్:-** పట్టణంలోని వీఏ బజార్‌లో వినియోగదారులను మోసం చేస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ వినియోగదారుడు కొనుగోలు చేసిన ప్యాకేజీపై గరిష్ఠ చిల్లర ధర ఎంఆర్పీ రూ.105గా ఉండగా, అదే వస్తువును రూ.175కు విక్రయించి అదనంగా రూ.70 వసూలు చేసినట్లు గుర్తించారు.ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించగా, ఎంఆర్పీ కంటే అధిక ధరకు విక్రయించిన విషయం నిజమని తేలింది పరోట ప్యాకెట్లు 750 గ్రాములు గాను 700 గ్రాములు తూకం రావడంతో తూకం తక్కువ రావడంతో ఎక్స్ పీరియడ్ డేట్ కూడా నమోదు కావడంతో ఇది లీగల్ మెట్రాలజీ చట్టం ప్రకారం నేరం కావడంతో వీఏ బజార్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి, రూ.25 వేల అపరాధ రుసుము ఆన్‌లైన్ ద్వారా చెల్లింపజేశారు.ఈ సందర్భంగా గుంతకల్ డివిజన్ లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శంకర్ మాట్లాడుతూ, వినియోగదారులను మోసం చేయడం, తక్కువ తూకం ఇవ్వడం, ఎంఆర్పీ కంటే అధిక ధరలకు వస్తువులు విక్రయించడం వంటి చర్యలను శాఖ తీవ్రంగా పరిగణిస్తుందని హెచ్చరించారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడే వ్యాపార సంస్థలపై కేసులు నమోదు చేసి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ఇంటి నుంచే దివ్యాంగులకు ప్రోత్సాహం మొదలు కావాలి

### త్వరలోనే దివ్యాంగులకు కొత్త పింఛన్లు ఇస్తాం.. పరిటాల సునీత

### కృత్రిమ అవయవాలు, సహాయక పరికరాలు ఉచితంగా పంపిణీ

### మీరు ధైర్యంగా అడుగు వేస్తే.. ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందన్న సునీత





**అనంతపురం,జూన్27.అక్షర టైమ్స్:-** దివ్యాంగులను ప్రోత్సహించడం ఇంట్లో కుటుంబసభ్యుల నుంచి ప్రారంభం కావాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండల కేంద్రంలోని పంచాయతీరాజ్ శాఖ అతిథి గృహంలో దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలు, సహాయక పరికరాలను ఉచితంగా అందజేశారు. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన 64 మంది దివ్యాంగులకు 2025-26 సంవత్సరానికిగాను రూ.20లక్షలు విలువ చేసే పరికరాల్ని అందజేశారు. భారత ప్రభుత్వ రంగ సంస్థ అలింకోవారు, సర్వ శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందించారు. పెద్ద, మధ్యస్థ సైజు వీల్‌చైర్లు, వాకర్స్, ట్రైసైకిల్స్, 7 నుంచి 18 సంవత్సరాల పిల్లలకు టీఎంఎల్ఎం కిట్స్, కమోడ్ సౌకర్యంతో కూడిన సీపీ వీల్‌చైర్లు, బీటీఈ డిజిటల్ వినికిడి పరికరాలు, పెద్దల కోసం రోలేటర్లు, బ్రెయిలీ కిట్లు ఇందులో ఉన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ మేనరికపు వివాహాలు, జన్యులోపాల కారణంగా దివ్యాంగులుగా జన్మిస్తుంటారన్నారు. ఇలాంటి పిల్లలను ధైర్యంగా ముందుకు తీసుకెళ్తున్న తల్లిదండ్రులకు చేతులెత్తి నమస్కరించాలన్నారు. అయితే కొంత మంది మాత్రం దివ్యాంగులైన పిల్లల్ని చిన్న చూపు చూడటం, నాలుగు గోడల మధ్యనే ఉంచడం, మిగిలిన పిల్లలతో సమానంగా చూడకపోవడం వంటివి చేస్తున్నారన్నారు. దీని వలన వారిలో ఆత్మస్థైర్యం మరింత దెబ్బతింటుందన్నారు. వారిని బయటకు తీసుకెళ్లడం కొంత కష్టమే అయినా మొదట కుటుంబసభ్యులే నిర్లక్ష్యం చేస్తే వారిని ఎవరూ ఆదరించరన్నారు. వారు ధైర్యంగా అడుగులు ముందుకు వేస్తే.. పిల్లలు కూడా రాణిస్తారన్నారు. పక్క వారు ఏదో అంటారన్న ఉద్దేశ్యంతో వారిని ఇంటికే పరిమితం చేయవద్దన్నారు. ఇప్పటికి చాలా మంది దివ్యాంగులు ఇంటిలోనే పని చేస్తూ స్వియఆర్జన చేస్తున్నారని.. ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మేనరికపు వివాహల గురించి కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా దివ్యాంగులను ప్రోత్సహిస్తోందన్నారు. గతంలో మూడు వేలు ఉన్న పింఛన్ ను 6వేలు చేసిందని.. పూర్తి స్థాయిలో మంచానికి పరిమితమైన వారికి 15వేలు ఇస్తున్నట్టు తెలిపారు. దివ్యాంగ శక్తి ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారని.. వారి సహాయకులకు 50శాతం రాయితీ ఇస్తున్నారన్నారు. ఇప్పుడు ఇంత ఖరీదైన పరికరాలను ఉచితంగా అందజేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.

# అనంత యువకుడికి లండన్ లో అరుదైన గౌరవం

### గొర్తి ఉదయ్ కిరణ్ కు బ్రిటన్ పార్లమెంట్ లో ఘనసత్కారం





**అనంతపురం,జూన్27.అక్షర టైమ్స్:-** నగరానికి చెందిన యువ పరిశోధకుడు, సామాజిక అధ్యయనశీలి గొర్తి ఉదయ్ కిరణ్ కు లండన్ లో అరుదైన గౌరవం దక్కింది. ఈ వేడుకలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (లండన్) సంస్థ సిఈఓ సంతోష్ శుక్లా, రాజేష్ శుక్ల, బ్రిటన్ పార్లమెంటు సభ్యులు గరేత్ బకాన్, వీరేంద్ర శర్మ, మిస్ ఇంగ్లాండ్ లిమిటెడ్ డైరెక్టర్ యాంజీ బిస్లె తదితరులు అవార్డును అందజేశారు. "గ్రామీణ యువతపై సోషల్ మీడియా ప్రభావం : ఒక అధ్యయనం" అనే అంశంపై ఆయన సమర్పించిన పరిశోధనా పత్రానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. లండన్ నగరంలోని బ్రిటన్ పార్లమెంట్ సభా మందిరంలో ఉదయ్ కిరణ్ ను ఘనంగా సత్కరించారు. ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ నల్లాని రాజేశ్వరి, ప్రభుత్వ హెడ్మాష్టర్ గొర్తి వెంకటస్వామి దంపతుల కుమారుడైన ఉదయ్ కిరణ్ ను ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు. తిరుపతి లోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ., సోషియాలజీ పూర్తి చేసిన ఉదయ్ కిరణ్ ప్రస్తుతం పోటీపరీక్షలకు సిద్ధమవుతున్నారు. అనంతపురం రామ్ నగర్ లోని ఉదయ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఐదవ తరగతి వరకు ప్రాథమికవిద్య నభ్యసించారు. ఇక్కడ జాతీయ రహదారి లోని శ్రీ చైతన్య పాఠశాలలో 6, 7 తరగతులు పూర్తి చేశారు. బెంగళూరు వద్ద ఆకాష్ ఇంటర్నేషనల్ స్కూల్లో 9 నుంచి 12 వ తరగతి వరకూ సిబిఎస్ఈ సిలబస్ లో మంచి ఫలితాలు సాధించారు. హైదరాబాద్ లోని ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ చదువుతూ, కెపి 21 వ సెంచరీ ఐఏఎస్ అకాడమీలో యూపీఎస్సీ పరీక్షలకు ప్రాథమిక శిక్షణ పొందారు. బి.ఏ., (ఈపిపి) పూర్తిచేశాక, ఢిల్లీలోని ప్రముఖ శిక్షణా సంస్థ నుంచి ఆన్లైన్ ద్వారా తర్ఫీదు పొందుతున్నారు. అంతర్జాతీయంగా సింగపూర్, దుబాయ్, బ్రిటన్ వంటి దేశాలను సందర్శించారు. దేశంలో ప్రసిద్ధి పొందిన విద్యావేత్తలు, సామాజికవేత్తలను వ్యక్తిగతంగా కలిసి పలు అంశాలపై చర్చించి మంచి అవగాహనను పెంచుకున్నారు. ప్రముఖ స్వచ్ఛంద సంస్థలు రాస్, పాస్, ఆర్.డి.టి. ల కార్యక్రమాలను ప్రత్యేకంగా పరిశీలించారు. వారు నిర్వహిస్తున్న అనాథల, అంధుల, వృద్ధుల ఆశ్రమాలను తరచూ సందర్శించారు. ఎస్వీ యూనివర్సిటీలో ఎం.ఏ., (సోషియాలజీ) చదివే కాలంలో ప్రాజెక్టు వర్క్ గా చేసిన అంశం మీద ఆసక్తితో మరింత లోతుగా అధ్యయనం సాగించారు. రాయలసీమ జిల్లాల్లోని పలు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి, అక్కడి యువత మీద సామాజిక మాధ్యమాల ప్రభావం గురించి ప్రత్యేక అధ్యయనం చేశారు. నగరాలతో పాటు గ్రామాలను కూడా సోషల్ మీడియా బాగా ఆకర్షించినట్లు గమనించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై కూడా ప్రత్యేక అధ్యాయాల్లో లోతుగా చర్చించారు. ఫలితాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసిన ఉదయ్ కిరణ్ తనదైన శైలిలో విశ్లేషించారు. మెంటార్ చంద్రశేఖర్, తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహంతో తన పరిశోధనా పత్రాలను "వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్" (లండన్) వారి దృష్టికి తీసుకెళ్లారు. సామాజిక అంశాల పట్ల ఇతనికున్న ఆసక్తి, అవగాహనను గుర్తించిన ఆ సంస్థ సిఈఓ సంతోష్ శుక్లా ప్రత్యేకంగా లండన్ కు ఆహ్వానించారు. సాక్షాత్తూ బ్రిటన్ పార్లమెంట్ లోని సభామందిరంలో ఘనంగా సత్కరించారు. అక్కడి పార్లమెంట్ సభ్యుల డైనింగ్ హాల్ లోనే బ్రిటిష్ అధికారులు, ఎంపి లతో కలిసి గౌరవంగా విందును కూడా ఏర్పాటు చేశారు. బ్రిటన్ పార్లమెంట్ ను సందర్శించే అరుదైన అవకాశం తనకు రావడం పట్ల సామాజిక పరిశోధక విద్యార్థి గొర్తి ఉదయ్ కిరణ్ ఆనందం వ్యక్తం చేశారు. భారతదేశంలో గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన, సామాజిక సాధికారత కోసం భవిష్యత్తులో తన వంతు కృషి సాగిస్తానని ఉదయ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**ఇది గొప్ప మైలురాయి : సిఈఓ**

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తన 10వ సమ్మిట్ - అంతర్జాతీయ అవార్డుల ప్రదానోత్సవం యూకే పార్లమెంట్‌లోని ప్రతిష్టాత్మకమైన హౌస్ ఆఫ్ కామన్స్, ప్యాలెస్ ఆఫ్ వెస్ట్‌మిన్‌స్టర్‌లో ఘనంగా జరిగిందని అధికారికంగా ప్రకటించింది. ఈ వేడుక సంస్థ చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన సమావేశాలలో ఒకటిగా నిలవనుంది. ఈ విశిష్టమైన వేడుక, యూకే (యునైటెడ్ కింగ్‌డమ్), యూఎస్ఏ (యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా), రష్యా, ఫ్రాన్స్, ఇటలీ, ఇండియా, నేపాల్, కజకిస్తాన్, కెనడా, మెక్సికో, పోర్చుగల్, స్పెయిన్, స్విట్జర్లాండ్, బెల్జియం, జర్మనీ, ఈజిప్ట్, స్వీడన్, నార్వే, ఫిన్లాండ్, పోలాండ్, జపాన్, ఆస్ట్రేలియా, మారిషస్ దేశాల నుండి వచ్చిన అత్యుత్తమ వ్యక్తులు, సంస్థలను సత్కరించే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ప్రజా సేవ, దౌత్యం, వ్యాపార రంగాలలో రాణించిన వారిని కీర్తించింది. ఈ వేడుకలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (లండన్) సంస్థ సిఈఓ సంతోష్ శుక్లా, రాజేష్ శుక్ల, బ్రిటన్ పార్లమెంటు సభ్యులు గరేత్ బకాన్, వీరేంద్ర శర్మ, మిస్ ఇంగ్లాండ్ లిమిటెడ్ డైరెక్టర్ యాంజీ బిస్లె తదితరులు అవార్డును అందజేశారు. ప్రపంచ ప్రముఖులు, క్యాబినెట్ మంత్రులు, దౌత్యవేత్తలు, విధాన రూపకర్తలు, అంతర్జాతీయ వ్యాపార నాయకులు వంటి ఉన్నత స్థాయి ప్రతినిధులు హాజరయ్యారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యతను సంతరించుకుంది. విభిన్న దేశాలు, రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటున్న ఈ వేడుక, అర్థవంతమైన చర్చలను ప్రోత్సహించి, అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేస్తుందని నిర్వాహకులు ఆశిస్తున్నారు. ప్రపంచ ఐక్యత, గుర్తింపు, పురోగతిని ప్రోత్సహించడంలో ఈ వేడుకల ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సీఈఓ సంతోష్ శుక్లా సభలో ప్రకటన చేశారు. ఈ వేడుక శ్రేష్ఠతను గౌరవించడమే కాకుండా, ప్రపంచ పరివర్తన దిశగా సామూహిక బాధ్యతను ప్రేరేపిస్తుందని ఆయన పేర్కొన్నారు. దాని అంతర్జాతీయ ప్రభావం, ఉన్నత స్థాయి భాగస్వామ్యంతో, 10వ సమ్మిట్ - అవార్డుల ప్రదానోత్సవం యూకే పార్లమెంట్ నడిబొడ్డున ఒక మైలురాయి సమావేశంగా నిలుస్తుందని వాగ్దానం చేశారు.

# ఉప్పర పల్లి గ్రామ పంచాయతీలో చెత్త నుండి సంపద సృష్టి

### ఒక్క అడుగు స్వచ్ఛత వైపు - చెత్త నుండి సంపద తయారీ





**అనంతపురం/రూరల్,జూన్27.అక్షర టైమ్స్:-** శుభ్రత - స్వచ్ఛత - స్వస్తతతో పాటు సంపద కూడా సాధ్యమేనని నిరూపిస్తున్న ఉప్పర పల్లి గ్రామంలోని 1350 ఇళ్ల నుండి తడి-పొడి చెత్తను వేరుగా సేకరించి చెత్త నుండి సంపద తయారీ కేంద్రానికి తరలిస్తున్నారు. తడి చెత్తను మొదట నాడెప్ పిట్స్‌లో పశువుల పేడతో కప్పి 2 నెలలు బాగా కుళ్ళిన తర్వాత వర్మీ తొట్టిలోకి మార్చి వానపాములు వదలి మరొక నెలలో వానపాముల ద్వారా నాణ్యమైన వర్మీ కంపోస్ట్‌ను తయారుచేస్తున్నారు.స్వచ్ఛరథం ద్వారా పొడి చెత్తను సేకరించి ప్రజలకు కావలసిన నిత్యవసర వస్తువులను అందిస్తూ, సేకరించిన పొడి చెత్తను రీసైకిల్ చేయుటకు తరలిస్తున్నారు. ప్రతి బుధవారం రోడ్డు పక్కల ఉన్న చెత్త దిబ్బలను స్వచ్ఛరథం ద్వారా పొడి చెత్తను సేకరించి ప్రజలకు కావలసిన నిత్యవసర వస్తువులను అందిస్తూ, సేకరించిన పొడి చెత్తను రీసైకిల్ చేయుటకు తరలిస్తున్నారు. ప్రతి బుధవారం రోడ్డు పక్కల ఉన్న చెత్త దిబ్బలను స్వచ్ఛ పథం కార్యక్రమంలో భాగంగా తొలగిస్తున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా గ్రామ పరిసరాలు శుభ్రంగా ఉండడమే కాకుండా ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతోంది. ఇటు ప్రజలకు, అటు గ్రామ పంచాయతీకి లబ్ధి చేకూరుతోంది.

**మరొక ముందడుగు - స్వంత వనరులతో అభివృద్ధి**

ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు ప్రతి గ్రామ పంచాయతీ స్వంత వనరులతో అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ఉప్పర పల్లిలోని ఎస్ డబ్ల్యు పిసి షెడ్‌లో వర్మీ కంపోస్ట్ తయారీ, ఫలసాయం మొక్కల పెంపకం, ఆకుకూరలు, కాయగూరలను పెంచుతున్నారు. అని ఇటీవల వర్మీ విక్రయం ద్వారా గ్రామ పంచాయతీకి దాదాపు రూ.10,000 ఆదాయం సమకూరింది. అని గ్రామాన్ని స్వచ్ఛ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దాలని పంచాయతీ కార్యదర్శి వర్ల శంకర్ గ్రామ ప్రజలను కోరారు.

# వాగ్దానాలు విస్మరించిన కూటమి ప్రభుత్వం

# విచ్చలవిడి బెల్టుషాపులతో మద్యం ఏరులై పారుతోంది..

**కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి మండిపాటు**



**రాయదుర్గం,జూన్27.అక్షర టైమ్స్:-** రాయదుర్గం లో ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు వై. మధుసూదన్ రెడ్డి మండిపడ్డారు. శనివారం రాయదుర్గంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఊరువాకాలి అనిల్ కుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు.అధికార పార్టీ అండదండలతో గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు ఏర్పాటు చేశారని, వాటిని వేలంపాటలో దక్కించుకుని మద్యం ఏరులై పారిస్తున్నారని ఆరోపించారు. యువత చిన్న వయసులోనే మద్యం, గంజాయికి బానిసై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బెల్టు షాపులు రద్దు చేసి మద్య నియంత్రణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ కింద మూడేళ్లలో రైతులకు రూ.60 వేలు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం రూ.14 వేలు మాత్రమే ఇచ్చారని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అమ్ముకోలేని దయనీయ స్థితిలో ఉన్నారని తెలిపారు. తక్షణమే మొక్కజొన్న, జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో పంట కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కరువు ప్రాంతాల్లో వలసలు నివారించేందుకు ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పేరు మార్చి, నిధులు తగ్గించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నీరుగార్చించని ధ్వజమెత్తారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో మళ్లీ వలసలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు.కొందరు క్షేత్రస్థాయి అధికారులు అధికార పార్టీ నేతలతో కలిసి ఉపాది హామీలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నా ప్రభుత్వం, ఉన్నతాధికారులు గట్టి చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రాయదుర్గం పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొని ఉందని, ఈ సమస్య పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేశారు.భవిష్యత్తు భారతావని, యువత ఆకాంక్షలు నెరవేర్చడానికి రాహుల్ గాంధీ ప్రధాని కావాలనే లక్ష్యంతో యువత పెద్ద ఎత్తున కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారని చెప్పారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ గౌని ప్రతాపరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్ నాయకత్వంలో పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాయదుర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షుడు జయన్న, మైనార్టీ విభాగం నాయకులు రఫీక్, ఉమర్ ఫారూఖ్, బీసీ సెల్ నాయకుడు గోనబావి తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం

**ఉండవల్లిలో రైతు పరిరక్షణ కమిటీ నేతలపై దాడులు దుర్మార్గం**

**అనంతపురంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన**

**కూటమి పాలనలో క్షీణించిన శాంతిభద్రతలు**

**మేం లాకప్ అంటే వాళ్లు మేకప్ అంటున్నారు..!**

**తాడిపత్రిలో శాంతియుత నిరసన తెలుపుతామంటే మాపై కేసులా?**

**నీయమ్మ..నా కొడకల్లారా అంటున్న జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చర్యలుండవా.?**

**అధికారం ఉందని విర్రవీగితే భవిష్యత్‌లో మూల్యం చెల్లించుకోకతప్పదు**

**వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ మండిపాటు**



**అనంతపురం,జూన్27.అక్షర టైమ్స్:-** రాష్ట్రంలో ఏ వర్గానికి కష్టం వచ్చినా మొదటగా గుర్తుకు వచ్చేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని, బాధితులకు అండగా పోరాటం చేసేది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీయేనని వైసీపీ యువజన విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో రైతుల ఆహ్వానం మేరకు రాజధాని రైతుల పొలాలను పరిశీలించేందుకు వెళ్లిన రైతులు, రైతు పరిరక్షణ కమిటీ నేతలు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బృందంపై టీడీపీ గూండాలు దాడి చేయడాన్ని ఖండిస్తూ శనివారం సాయంత్రం అనంతపురంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద యువజన విభాగం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు తన రాజకీయ లబ్ధి కోసం తెలంగాణ ముఖ్యమంత్రి వద్ద రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను తాకట్టు పెట్టారన్నారు. అదే తరహాలో తన ఆర్థిక లబ్ధి కోసం రాజధాని పేరుతో రైతుల భూములను లాక్కుంటున్నారని విమర్శించారు. గతంలోనే రాజధాని కోసం 30 వేల ఎకరాలు తీసుకున్నారని, ఇప్పుడు ల్యాండ్ పూలింగ్ పేరుతో మరో 50 వేల ఎకరాలను తీసుకుంటున్నారని తెలిపారు. భూములు ఇవ్వని రైతులను బెదిరిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలోనే రాజధాని ప్రాంతంలో ఉన్న కొండవీటి వాగు నుంచి రైతుల భూముల్లోకి నీటిని పంపి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై బాధిత రైతులు అధికారులను సంప్రదించినా న్యాయం జరగడం లేదన్నారు. ఈ నేపథ్యంలోనే రాజధాని రైతులు వైఎస్ జగన్‌ను కలిస్తే మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలతో రాజధాని రైతు పరిరక్షణ కమిటీ వేశారన్నారు. రైతుల ఆహ్వానం మేరకు శనివారం పొలాలను పరిశీలించడానికి వెళ్లినా వారిపై టీడీపీ గూండాలు దాడులు చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎవరైనా ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని, ప్రజల పక్షాన ప్రశ్నించడం నేరమా? అని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా శాంతిభద్రతలు క్షీణించాయని, రాష్ట్ర హోం మంత్రిని ప్రశ్నిస్తే ఎస్సీ కార్డును బయటకు తీస్తున్నారని విమర్శించారు. ఇటీవల దళిత యువకుడు పోలీసుల వేధింపులతో ఆత్మహత్య చేసుకుంటే పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సాయికృష్ణ అనే యువకుడి లాకప్ డెత్ గురించి తాము మాట్లాడితే వాళ్లు మాత్రం మేకప్ గురించి మాట్లాడి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా తాడిపత్రిలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరుతూ శాంతియుత నిరసన తెలిపితే తమపై కేసులు పెట్టారని తెలియజేశారు. ఇటీవల జేసీ ప్రభాకర్‌రెడ్డి రెచ్చగొడుతూ తాడిపత్రిలోని పోలీస్‌స్టేషన్ వద్దే స్నానం చేస్తే కనీసం కేసు పెట్టలేదన్నారు. మా పార్టీ జిల్లా అధ్యక్షుడిని నీయమ్మ..నా కొడకల్లారా అంటున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. పోలీసులతో ఏదైనా చేయచ్చని అనుకోవద్దని, ఈ రోజు విర్రవీగితే భవిష్యత్‌లో మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనునిత్యం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దాదాఖలందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మణికంఠ, నగర ఉపాధ్యక్షుడు వినీత్, రమేష్, ఉదయ్, నాయకులు హరి, అబ్బాస్, మైను, మసూద్, కోదూరు రాము, సుబ్బారావు, బోయ హర్ష, గుజ్జల శివయ్య, రోహిత్, విష్ణు, సాయికుమార్, సాకే కుమార్, హిమకర్ సాయి, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ లో బీఎల్ఏలే చాలా కీలకం

**ఎమ్మెల్యే పరిటాల సునీత**

**వారు ప్రతి ఇంటికి వెళ్లేలా నాయకులు చొరవ తీసుకోవాలి**

**రామగిరి మండల నాయకులకు ఎస్ఐఆర్ పై అవగాహన కార్యక్రమం**

**ఎస్ఐఆర్ విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం వద్దని సూచన**



**అనంతపురం,జూన్27.అక్షర టైమ్స్:-** స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్) లో బూత్ లెవల్ ఏజెంట్లదే కీలకమని.. వారు ప్రతి ఇంటికి వెళ్లేలా నాయకులు చూడాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. రామగిరి మండల కేంద్రంలోని పంచాయతీ రాజ్ శాఖ అతిధి గృహంలో మండల నాయకులతో ఎస్ఐఆర్ పై సమావేశం నిర్వహించారు. బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో ఎదుర్కొనే పరిస్థితులు, ఓటరు ధృవీకరణ విధానం, కుటుంబ లింకేజీలు, డ్రాఫ్ట్ జాబితా పరిశీలన, అభ్యంతరాల ప్రక్రియ తదితర అంశాలపై చర్చించారు. ఇప్పటి వరకు బీఎల్ఏ లు ఎంత వరకు డోర్ టూ డోర్ పూర్తి చేశారన్నది ఆరా తీశారు. కొన్ని చోట్ల ఇంకా కొందరు ఈ ప్రక్రియను వేగవంతం చేయకపోవడాన్ని ప్రస్తావించారు. మండల నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జిలు ఈ విషయంపై చొరవ తీసుకోవాలన్నారు. ఈనెల 15వ తేది నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ 20-25 ఏళ్లకోసారి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ జరుగుతుందని.. 2002 ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకుని స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ప్రక్రియను చేస్తున్నారన్నారు. జులై 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ చేస్తారని.. జులై 15 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు ఇంటింటి ప్రచారం చేపట్టాల్సి ఉంటుందన్నారు. దీని పట్ల నిర్లక్ష్యంగా ఉంటే భవిష్యత్ లో మనకు నష్టం జరిగే అవకాశం ఉంటుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు ఉండాలని.. అనర్హులకు తావు లేకుండా చూడాలన్నారు.

# ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయిద్దాం






**వ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దాం**

**నల్లచెరువులో ఘనంగా పల్స్ పోలియో అవగాహన ర్యాలీ**

**నల్లచెరువు,జూన్27.అక్షర టైమ్స్:-** చిన్నారుల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా నల్లచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శనివారం ఘనంగా ప్రచార ర్యాలీ నిర్వహించారు. పీహెచ్సీ వైద్యాధికారిణి డాక్టర్ అలేఖ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ పి హెచ్ సి నుంచి ప్రారంభమై రైల్వే స్టేషన్ ప్రధాన వీధి, హైవే మీదుగా నల్లచెరువు పోలీస్ స్టేషన్ వరకు డప్పు వాయిద్యాలతో సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ అలేఖ్య మాట్లాడుతూ.. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని కోరారు. పీహెచ్సీ సీహెచ్ఓ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గతంలో పోలియో చుక్కలు వేసుకున్న పిల్లలకు కూడా ఐదు సంవత్సరాల లోపు ఉంటే మళ్లీ చుక్కలు వేయించడం అవసరమన్నారు. పోలియో వ్యాధి బారిన పడి చిన్నారులు వికలాంగులు కాకుండా కాపాడేందుకు రెండు చుక్కల టీకా ఎంతో కీలకమని తెలిపారు. "సంపూర్ణ ఆరోగ్యానికి రెండు చుక్కలు.. నిండు జీవితానికి రెండు చుక్కలు" అనే నినాదాలతో ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఆదివారం పల్స్ పోలియో కేంద్రాల్లో టీకాలు వేయించుకోవాలని, ఎవరైనా పిల్లలు మిగిలిపోతే సోమవారం, మంగళవారం రోజుల్లో సూపర్వైజర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని వైద్యాధికారిణి డాక్టర్ అలేఖ్య తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఆరు రూట్లను ఏర్పాటు చేసి ఏఎన్ఎంలు, ఎంఎల్ హెచ్ పిలు, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అలేఖ్య, సీహెచ్ఓ రామచంద్రారెడ్డి, సూపర్వైజర్లు భారతి, రెడ్డమ్మ, సుధాకర్, ఫార్మసిస్ట్ ప్రకాష్, హెల్త్ అసిస్టెంట్లు ముస్తఫా, సూర్యనారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ, ఎమ్ ఎల్ హెచ్ పిలు, సచివాలయ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, గార్డియన్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు జోసెఫ్, జోబీ, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారుల ఆరోగ్యమే సమాజ భవిష్యత్తు అని, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించి వ్యాధి రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని వైద్య సిబ్బంది పిలుపునిచ్చారు.

# జలదికి తరలిన పీర్లు



**పెద్దవడుగూరు,జూన్27.అక్షర టైమ్స్:-** మండలంలోని పలు గ్రామాలలో మొహరం పండుగను ముస్లిం సోదరులు, కులామతాలకు అతీతంగా పెద్ద ఎత్తున జరుపు కున్నారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ పీర్ల పండుగను ఈ సారి కూడా వైభవంగా నిర్వహించు కున్నారు. మండల కేంద్రంతో పాటు ఆయాగ్రామాలలో గ్రామ వీదుల గుండా పీర్ల శోభాయాత్ర డప్పు వాయిద్యాలతో ఘనంగా పీర్ల పండుగను జరుపు కున్నారు. ఈ పీర్ల ను చూసేందుకు ప్రజలు వచ్చారు. పీర్ల గుడి ప్రత్యేకంగా అలంకరించిన పీర్లకు ఆయా గ్రామాల్లో భక్తులు పూలు, చక్కెర సమర్పించారు. పలు గ్రామాల్లో హిందువులు, ముస్లీంలు కలిసికట్టుగా పీర్ల ఎదుట దప్పుచప్పుడులతో తెల్లవారుజామున మొహర్రం పండుగలో భాగంగా పీర్ల స్వాములు గ్రామ వీధుల్లోకి రాగా భక్తులు దారిపోడవునా నీరుపోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ పీర్ల పండుగలో , ప్రజలు పాల్గొన్నారు. సాయంత్రం వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ పీర్లను ఎత్తుకొని జలదికి తీసుకువెళ్లారు

# నూతన ఎస్ఐ బాధ్యతలు స్వీకరణ



**పెద్దవడుగూరు,జూన్27.అక్షర టైమ్స్:-** పెద్దవడుగూరు పోలీసు స్టేషన్ కు నూతనంగా రాఘవేంద్రప్ప శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాఘవేంద్రప్ప మాట్లాడుతూ మండలంలో నేరాలను అదుపులో ఉంచడానికి, తన వంతు కృషి చేస్తానని. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామ న్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు అసాంఘిక కార్యక్రమా లు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ ఆంజనేయులు అనంతపురం పిటిసికి బదిలీపై వెళ్ళారు.

# ఒకటవ డివిజన్ సర్ లో పాల్గొన్న వివిధ పార్టీల కార్యకర్తలు



**అనంతపురం,జూన్27.అక్షర టైమ్స్:-** ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఒకటవ డివిజన్ లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. శనివారం డివిజన్ లోని ఓటర్ లిస్ట్ ను పరిశీలించి, సర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన సహాయ సహకారాన్ని అందించేందుకు ఉమ్మడిగా పనిచేస్తున్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సాయి కృష్ణ, వైఎస్ఆర్సిపి మాజీ కార్పొరేటర్ లాలప్ప, టిడిపి మాజీ కార్పొరేటర్ చంద్రమౌళి, టిడిపి నాయకులు, జయ జన జాగృతి ఫౌండర్ జనార్ధన్ రెడ్డి, శీన తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అన్నదానం, అవగాహన



**అనంతపురం,జూన్27.అక్షర టైమ్స్:-** నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్ పర్సన్ డాక్టర్. ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో ఎయిమ్ ఫర్ సేవ ఆశ్రమంలో విద్యార్థులకు అన్నదానంతో పాటు అవగాహన కల్పించారు. శనివారం శ్రీ స్వామి దయానంద సరస్వతి గారి ఆశ్రమంలో ట్రస్ట్ సభ్యులు.. మా తమ్ముడు రమణ వారి సతీమణి అరుణ వారి కుమార్తె చిరంజీవి తనుజ పుట్టిన రోజు సందర్భంగా వారి సకారంతో అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని చదువులో కొనసాగించాలన్నారు. చదువులో విజయం సాధించగలిగితే భవిష్యత్తులో జీవితంలోనూ విజయం సాధిస్తామని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముందుగా మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. పెద్దల ఆశీస్సులు ఉంటే జీవితంలో కుటుంబ బాధ్యతలు, జీవన విధానాలు అలవాడుతాయన్నారు. ప్రతి విద్యార్థి తన అనుకున్న లక్ష్యాలను చేరుకునే వరకు పట్టు వదలని శ్రమతో కష్టపడాలన్నారు. తోటి వారికి సహాయం చేసే గుణం ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు స్వామి సత్యాత్మానంద, చక్రపాణి, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాసుపత్రి వద్ద పేదలకు అన్నదానం



**అనంతపురం,జూన్27.అక్షర టైమ్స్:-** నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం, శ్రీ విఘ్నేశ్వరాయ నమః శ్రీ సద్గురు సాయినాథ్ మహారాజ్ అన్నప్రసాద సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు ట్రస్ట్ చైర్ పర్సన్ డాక్టర్ ఎస్. నిర్మలమురళి అన్నదానం చేశారు. ట్రస్ట్ సభ్యుల సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని శనివారం ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వచ్చే పేదలు ఆకలి తీర్చడానికి అదృష్టం ఉండాలన్నారు. దేవుడు మాకు ఇచ్చిన కొంతలో పేదలకు ఏదో ఒక రూపంలో సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. బాధ్యతగా పేదల ఆకలి తీర్చడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఇవాళ దాదాపు 200 మందికి పైగా అన్నదానం చేశామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఓబులపతి, కిష్టప్ప రామకృష్ణ, రామలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పామిడి మండలంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆకస్మికతనిఖీ



**పామిడి,జూన్27.అక్షర టైమ్స్:-** మండలంలోని కాలాపురంలో రైతన్న నీకోసం కార్యక్రమం పట్ల అనంతపురం జిల్లా వ్యవసాయ అధికారి ఎం సాలురెడ్డి ఆకస్మికంగా తనఖీ చేశారు. రైతన్న నీకోసం కార్యక్రమంలో పాల్గొని ఆత్మ నిర్భయత మిషన్ పప్పు దినుసులు అభివృద్ధి పథకం కింద కంది విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విజయకుమార్, మరియు ఎంపీవోలు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ఏసీ కొనుగోలు చేయాలనుకునేవారికి షాక్.. ధరలు మరోసారి పెంపు ఎంతంటే..?



సమ్మర్ వేళ ఏసీలు కొనుగోలు చేయాలనుకునేవారికి షాక్ తగులుతోంది. ఎయిర్ కండీషనర్ ధరలు భారీగా పెరుగుతున్నాయి. జనవరి నుంచి ధరలను తయారీదారులు పెంచుతూనే ఉన్నారు. ఏసీల తయారీకి ఉపయోగించే ముడి సరుకు ధరలు యుద్ధం వల్ల పెరుగుతున్నాయి. ఇక ఎల్పీజీ గ్యాస్ సరఫరా కొరత వల్ల కూడా ధరలు పెరుగుతున్నాయి. సమ్మర్ రావడం, ఉష్ణోగ్రతలు రికార్డ్ స్థాయిలో నమోదు అవుతుండంతో ఎండ వేడికి జనాలు అల్లాడిపోతున్నారు. ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. దాదాపు 45 డిగ్రీల సెల్సియస్‌కు మించి ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో హీట్‌తో పాటు వడగాల్పులు, ఉక్కబోతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మధ్యాహ్నం వేళల్లో రోడ్లపై జనసంచారం తగ్గుతుండటంతో.. వేడి నుంచి తట్టుకునేందుకు ఇళ్లల్లో చల్లదనం కోసం ఏసీలు, కూలర్లు ఎక్కువగా వాడుతున్నారు. అయితే సమ్మర్ కారణంగా ఏసీలకు ఫుల్ డిమాండ్ పెరిగింది. దీంతో వీటి ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఏసీల ధరలు మూడు రెట్లు పెరిగాయి. ధరలు పెరిగినా ప్రజలు మాత్రం వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తూనే ఉన్నారు.

**మూడు రెట్లు పెరిగిన ధరలు**

బీఈఈ నిబంధనల్లో మార్పుల వల్ల జవవరిలో ఏసీల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఆ తర్వాత ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ఏసీ విడిభాగాల సరఫరాకు సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో తయారీదారులు ఏసీల ధరలను మరోసారి పెంచారు. అయితే ఇటీవల రాగి, ప్లాస్టిక్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల ధరలు పెరిగాయి. ఈ క్రమంలో మరోసారి ఏసీల ధరలను కంపెనీలు పెంచేశాయి. నాలుగు నెలల్లోనే మూడు రెట్లు ధరలు పెరగడంతో కొనుగోలుదారులు షాక్ అవుతున్నారు. ఇక ఏసీల తయారీలో హీట్ ఎక్స్చేంజర్ల తయారీకి పెద్ద ఎత్తున వెల్డింగ్ అవసరం. ఈ వెల్డింగ్‌కు ఎల్పీజీ అవసరం. కానీ ఎల్పీజీ సరఫరాలో కొరత వల్ల ఏసీల ఉత్పత్తిపై ప్రభావం పడుతోంది.

**మరింత పెరిగే అవకాశం**

జనవరి 1 నుంచి బీఈఈ నిబంధనల్లో కేంద్రం మార్పులు చేసింది. దీని వల్ల ఫైవ్-స్టార్ ఏసీల అవుట్ డోర్ యూనిట్లు పెద్దగా మారాయి. దీంతో ఏసీ యూనిట్ల విడిభాగాలు అందుబాటులో లేకుండా పోయాయి. దీని వల్ల తయారీ కంపెనీలు త్రీ స్టార్ ఏసీల ఉత్పత్తిని పెంచగా.. గత సంవత్సరం ఫైవ్-స్టార్ ఏషీలు ఈ ఏడాది త్రీ-స్టార్‌గా మారాయి. అయితే పాత స్టాక్ అయిపోతుండగా.. ఉత్పత్తి తగ్గిపోవడం వల్ల కొత్త స్టాక్ రావడం లేదు. దీని వల్ల ప్రజలు తమకు ఇష్టమైన మోడళ్లను కొనుగోలు చేయలేకపోతున్నారు. ఈ ఏడాదిలో దక్షిణ రాష్ట్రాల్లో ఏసీల అమ్మకాలు భారీగా పెరిగాయి. 80 నుంచి 90 శాతం ఏసీల అమ్మకాలు పెరిగాయి. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో అమ్మకాలు ఎక్కువగా జరిగాయి. రానున్న రోజుల్లో ఏసీల ధరలు మరింత పెరిగే అవకాశముందని పారిశ్రామిక వర్గాలు చెబుతున్నాయి.

# ప్రతీ ఏడాది మీ అకౌంట్లోకి రూ.60 వేలు.. కేంద్ర ప్రభుత్వం అదిరిపోయే స్కీమ్.. వీరందరికీ వర్తింపు..



కేంద్ర ప్రభుత్వం అటల్ పెన్షన్ యోజన పథకాన్ని ఎప్పటినుంచో అమలు చేస్తోంది. ఈ పథకంలో కొంత మొత్తంలో ప్రీమియం చెల్లిస్తే.. 60 ఏళ్ల తర్వాత నెలనెలా పెన్షన్ పొందవచ్చు. ప్రతీ నెలా రూ.5 వేల వరకు పెన్షన్ పొందే సౌకర్యం ఇందులో ఉంది. ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ తర్వాత పెన్షన్ అందుతుంది. అదే ప్రైవేట్ ఉద్యోగులకు ఈపీఎఫ్‌వో ద్వారా 60 ఏళ్ల తర్వాత నెలనెలా పెన్షన్ వస్తుంది. ఈపీఎఫ్‌వో సౌకర్యం లేనివారికి రిటైర్మెంట్ తర్వాత ఎలాంటి పెన్షన్ ప్రయోజనాలు ఉండవు. అంతేకాకుండా వివిధ రంగాల్లో పనిచేసేవారికి పీఎఫ్ సౌకర్యం అనేది ఉండదు. ఈ క్రమంలో అసంఘటిత రంగంలో పనిచేసేవారి కోసం కేంద్ర ప్రభుత్వం అటల్ పెన్షన్ యోజన పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకంలో కొంతమొత్తంలో ప్రీమియం చెల్లిస్తే.. 60 ఏళ్ల తర్వాత పెన్షన్ పొందవచ్చు. ఈ పథకంలో ఎవరెవరు చేరవచ్చు..? ఎంత పింఛన్ వస్తుంది? అనే విషయాలు చూద్దాం.


ఏడాదికి రూ.60 వేలు

2015లో అటల్ పెన్షన్ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు ఇందులో చేరేందుకు అర్హులు. 60 ఏళ్లు వచ్చేంతవరకు కొంత మొత్తంలో ప్రీమియం చెల్లిస్తే.. అందుకు సమానంగా ప్రభుత్వం మరికొంత చెల్లిస్తుంది. 60 ఏళ్ల తర్వాత మీకు నెలనెలా పెన్షన్ వస్తుంది. మీ చెల్లించే ప్రీమియంను బట్టి రూ.వెయ్యి నుంచి రూ.5 వేల వరకు పెన్షన్ పొందవచ్చు. అంటే ఏడాదికి రూ.12 వేల నుంచి రూ.60 వేల వరకు పొందవచ్చు. మీకు రూ.5 వేల పెన్షన్ కావాలంటే ప్రీమియం ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది. అదే రూ.వెయ్యి కావాలంటే తక్కువ మొత్తంలో ఉంటుంది. ఇక మీ వయస్సును బట్టి కూడా ప్రీమియం మారుతూ ఉంటుది. చిన్న వయస్సులో చేరితే ప్రీమియం తక్కువగా ఉంటుంది. వయస్సు పెరిగే కొద్ది చేరితో ప్రీమియం ఎక్కువగా ఉంటుంది. మీ సమీపంలోని ఏదైనా బ్యాంక్‌కు వెళ్లి ఈ పథకంలో చేరవచ్చు. లేదా పోస్టాఫీస్ ద్వారా అయినా చేరవచ్చు. ప్రీమియం మీ అకౌంట్ నుంచి ఆటోమేటిక్‌గా డెబిట్ అవుతుంది. అలాగే 60 ఏళ్ల తర్వాత మీ అకౌంట్లోనే నెలనెలా పెన్షన్ జమ అవుతుంది.

60 ఏళ్ల తర్వాత మరణిస్తే..

ఒకవేళ పథకంలో చేరిన వ్యక్తి 60 ఏళ్ల తర్వాత మరణిస్తే జీవిత భాగస్వామికి ప్రతీ నెలా పెన్షన్ లభిస్తుంది.

# విజయనగర వైభవానికి ప్రతీకగా శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహావిష్కరణ



## కదిరిలో ఘనంగా మహోత్సవానికి ఏర్పాట్లు ప్రముఖుల రాక

**కదిరి,జూన్27.అక్షర టైమ్స్:-** విజయనగర సామ్రాజ్య చక్రవర్తి, తెలుగు జాతి గర్వకారణమైన శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహావిష్కరణ మహోత్సవం కదిరి పట్టణంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కదిరి పట్టణంలోని సైదాపురం ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఈ కార్యక్రమం ఆదివారం (28-06-2026) సాయంత్రం 4:30 గంటలకు వైభవంగా జరగనుంది. కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ మహోత్సవానికి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, బలిజ సంఘం ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ,కందుల దుర్గేష్,సత్య కుమార్ యాదవ్,సవిత , భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు , తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు పాల్గొననున్నారు. విశిష్ట అతిథిగా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరై కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తెలుగు సంస్కృతి, సాహిత్యం, కళలు, పరిపాలన రంగాల్లో చెరగని ముద్ర వేసిన శ్రీకృష్ణదేవరాయల స్మృతిని చిరస్థాయిగా నిలిపేందుకు ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మహోన్నత చారిత్రక ఘట్టానికి సాక్షులుగా నిలిచేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు, బలిజ సంఘం బంధుమిత్రులు, కదిరి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# పీఎం కిసాన్ సాయం ఆలస్యం చేయొద్దు - రైతులకు వెంటనే చెల్లించాలి

## ముదిగుబ్బ మండల సిపిఐ కార్యదర్శి చల్లా శ్రీనివాసులు

## అన్నదాత సుఖీభవలో పీఎం కిసాన్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్

## రైతుల ఖాతాల్లో వెంటనే పీఎం కిసాన్ నగదు జమ చేయాలి: చల్లా శ్రీనివాస్



**ముదిగుబ్బ,జూన్27.అక్షర టైమ్స్:-** అన్నదాత సుఖీభవ పథకం కింద పీఎం కిసాన్‌కు సంబంధించిన రూ.2,000 ఆర్థిక సహాయం అర్హులైన రైతులందరికీ వెంటనే మంజూరు చేసి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల వ్యవసాయ అధికారి రవీంద్రకు సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ, 2026--27 సంవత్సరానికి సంబంధించిన అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా మండలంలోని అనేక మంది రైతులకు పీఎం కిసాన్ కింద అందాల్సిన రూ.2,000 ఇంకా బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని తెలిపారు. ఇప్పటికే ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభమై రైతులు సాగు పనులకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ ఆర్థిక సాయం అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పంటల సాగుకు విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ అవసరాల కోసం ఈ నిధులు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని, అర్హులైన ప్రతి రైతుకు ఆలస్యం లేకుండా పీఎం కిసాన్ పరిహారం విడుదల చేసి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని వ్యవసాయ అధికారిని కోరారు. రైతుల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తక్షణ చర్యలు చేపట్టేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. మండల వ్యవసాయ అధికారి రవీంద్ర స్పందిస్తూ, రైతుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి తిప్పయ్య, పార్టీ నాయకులు రామకృష్ణ, వై. రమేష్ నాయుడు, అమిలినేని రామంజి, గనే నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద బాపనపల్లిలో భక్తిశ్రద్ధలతో ఘనంగా మొహరం వేడుకలు


## మత సామరస్యానికి ప్రతీకగా అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యం

## ప్రశాంతంగా ముగిసిన వేడుకలు



**ముదిగుబ్బ,జూన్27.అక్షర టైమ్స్:-** శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలంలోని పెద్ద బాపనపల్లి గ్రామంలో మొహరం వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పీర్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు, సంప్రదాయ ఆచారాలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొహరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల సందర్భంగా గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొని మొహరం పండుగ విశిష్టతను చాటిచెప్పారు. గ్రామ యువకులు, పెద్దలు కలిసి వేడుకల ఏర్పాట్లను సమన్వయం చేస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. మొహరం సందర్భంగా నిర్వహించిన ఊరేగింపు గ్రామ ప్రధాన వీధుల గుండా సాగి భక్తులను ఆకట్టుకుంది. ప్రజలు పెద్ద ఎత్తున హాజరై పీర్లను దర్శించుకుని శాంతి, సౌభాగ్యం కోసం ప్రార్థనలు చేశారు. మత సామరస్యానికి ప్రతీకగా వివిధ వర్గాలకు చెందిన ప్రజలు ఒకే వేదికపై పాల్గొని పరస్పర సోదరభావాన్ని చాటారు. వేడుకలు ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా పోలీసులు తగిన భద్రతా ఏర్పాట్లు చేశారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు పోలీసులకు సహకరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, మొహరం వేడుకలు శాంతి, ఐక్యత, సోదరభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా గ్రామ ప్రజలందరి సహకారంతో వేడుకలను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు.

# ఈ నకిలీ వెబ్‌సైట్లు ఓపెన్ చేయకండి ఫాస్టాగ్ విషయంలో కేంద్రం బిగ్ అలర్ట్..




ఫాస్టాగ్ వార్షిక పాస్ తీసుకోవాలనుకుంటున్నారా..? గూగుల్‌లోకి వెళ్లి సెర్చ్ చేసి తెలియని వెబ్‌సైట్లో తీసుకుంటున్నారా..? అయితే మీరు జాగ్రత్తగా ఉండాల్సిందే. మీరు యాక్సెస్ చేసేది నకిలీ వెబ్‌సైట్ కావొచ్చు. ఇటీవల ఫాస్టాగ్ వార్షిక పాస్ అందిస్తామంటూ నకిలీ వెబ్‌సైట్లు పుట్టుకొస్తున్నాయి. దీంతో వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎన్‌హెచ్‌ఏఐ హెచ్చరించింది. ప్రస్తుతం టోల్ ఫీజు చెల్లింపులకు ఫాస్టాగ్ అనేది తప్పనిసరి అయింది. క్యాష్ పేమెంట్స్‌ను ఎన్‌హెచ్‌ఏఐ పూర్తిగా బంద్ చేయడంతో ఫాస్టాగ్ ద్వారానే టోల్ చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఫాస్టాగ్ లేనివారు కూడా ఇప్పుడు తీసుకుంటున్నారు. ఇక కొంతమంది ఫాస్టాగ్ వార్షిక పాస్ కూడా తీసుకుంటున్నారు. అయితే కొన్ని నకిలీ వెబ్‌సైట్లు ఫాస్టాగ్ వార్షిక పాస్ పేరుతో వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాయి. ఇటీవల ఇలాంటి మోసాలు పెరుగుతున్న క్రమంలో.. ఇది నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా దృష్టికి వెళ్లింది. దీందో వాహనదారులను అలర్ట్ చేస్తూ ఎన్‌హెచ్‌ఏఐ ఒక ప్రకటన జారీ చేసింది. కొంతమంది నకిలీ వెబ్ సైట్లు సృష్టించి ఫాస్టాగ్ వార్షిక పాస్ అందిస్తామంటూ మోసాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి ఫేక్ వెబ్ సైట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది.

**ప్రభుత్వ వెబ్‌సైట్ల తరహాలో డిజైన్**

వాహనదారులను టార్గెట్‌గా చేసుకుని ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న క్రమంలో జాగ్రత్తగా ఉండాలని ప్రజలను ఎన్‌హెచ్‌ఏఐ హెచ్చరించింది. కొంతమంది మోసగాళ్లు ప్రభుత్వ పోర్టల్స్ మాదిరిగా ఉండే వెబ్ సైట్లను క్రియేట్ చేసి మోసాలకు పాల్పడుతున్నారు. ఈ వెబ్‌సైట్లు అసలైన పోర్టల్స్‌లానే కనిపిస్తాయి. దీంతో వాహనదారులు చాలామంది తేడాలను గుర్తించలేకపోతున్నారు. దీంతో ఫాస్టాగ్‌కు సంబంధించి ఏ పనికైనా అధికారిక వెబ్‌సైట్లను మాత్రమే ఉపయోగించాలని, నకిలీ ఫ్లాట్‌ఫామ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎన్‌హెచ్‌ఏఐ స్పష్టం చేసింది. అసలైన ఫాస్టాగ్ వెబ్‌సైట్ల డిజైన్‌ను కాపీ చేస్తూ నకిలీ వెబ్‌సైట్లను మోసగాళ్లు తయారుచేస్తున్నారు. ఈ లింకులను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారు. దీంతో గూగుల్ సెర్చ్ ఫలితాల్లో ఇవి టాప్‌లో ఉంటున్నాయి. వెబ్‌సైట్లోకి వెళ్లగానే మొబైల్ నెంబర్, వెహికల్ నెంబర్, చెల్లింపు సమాచారం వంటి వివరాలను అడుగుతున్నారు. కొంతమంది నిజమైన వెబ్‌సైట్ అనుకుని చెల్లింపులు చేసి మోసపోతున్నారు.

**మోసపోకుండా ఉండాలంటే..?**

రాజమార్గయాత్ర యాప్‌లో మాత్రమే ఫాస్టాగ్ వార్షిక పాస్ లభిస్తుంది. దీని నుంచే మాత్రమే తీసుకోవాలి. ఇతర ఫ్లాట్‌ఫామ్‌లకు అధికారిక అనుమతి లేదు. దీంతో వేరే సైట్లను ఆశ్రయించవద్దు. మీకు తెలియని లేదా అనుమానాస్పద లింక్‌లను ఓపెన్ చేయవద్దు. ధృవీకరించని సైట్లలో మీ వాహనం లేదా ఫాస్టాగ్ వివరాలను పంచుకోవద్దు. రాజమార్గ యాత్ర యాప్‌ను మాత్రమే ఉపయోగించండి. ఈ సూచనలు పాటించడం వల్ల వాహనదారులు మోసగాళ్ల బారిన పడి డబ్బులు కోల్పోకుండా ఉంటారని ఎన్‌హెచ్‌ఏఐ స్పష్టం చేసింది. ఇప్పటికైనా వాహనదారులు మోసపోకుండా ఉండాలంటే అధికారిక యాప్‌లను మాత్రమే వాడాలని, తెలియనివాటి జోలికి పోవద్దని సూచించింది.

# మీ ఒరిజినల్ సర్టిఫికెట్లు కాలేజీ వాళ్లు అట్టిపెట్టుకున్నారా..? ఇలా చేస్తే క్షణాల్లో తిరిగి ఇంటికొస్తాయ్



అడ్మిషన్ల పేరుతో ప్రైవేట్ కళాశాలలు విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను అట్టిపెట్టుకోవడం చట్టరీత్యా నేరం. ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు తమ హక్కులను ఎలా కాపాడుకోవచ్చో తెలుసుకోండి. ఆ వివరాలు ఏంటో ఇప్పుడు ఈ స్టోరీలో తెలుసుకుందామా.. ఓ సారి స్టోరీ చూసేయండి. విద్యాసంస్థలు విజ్ఞానాన్ని పంచే దేవాలయాలు కావాలి. కానీ నేటి కాలంలో కొన్ని ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులను తమ చెప్పుచేతల్లో ఉంచుకునే వ్యాపార కేంద్రాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా అడ్మిషన్ల సమయంలో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకుని, కోర్సు మధ్యలో మారాలనుకున్నా లేదా ఇతర కారణాల వల్ల వెళ్లాలనుకున్నా వాటిని తిరిగి ఇవ్వకుండా వేధించడం ఒక ప్రధాన సమస్యగా మారింది. అయితే, ఇలా సర్టిఫికెట్లను అట్టిపెట్టుకోవడం చట్టరీత్యా నేరమని చాలామందికి తెలియదు. హైకోర్టు అడ్వకేట్ రవి కొండూరు ప్రకారం.. ఇంజనీరింగ్, మెడికల్ లేదా ఏదైనా వృత్తి విద్యా కోర్సుల్లో చేరేటప్పుడు ఒరిజినల్ సర్టిఫికెట్లను కాలేజీ కస్టడీలో ఉంచుకోవడం చట్టవిరుద్ధం. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(ఖ+జ) 2018 మార్గదర్శకాల ప్రకారం, కళాశాలలు కేవలం ధృవీకరణ కోసం మాత్రమే అసలు పత్రాలను చూడాలి. అడ్మిషన్ రికార్డుల కోసం కేవలం స్వీయ-ధృవీకరించిన (గావశ్రీట-ఫ్వర్-వఎ) జిరాక్స్ కాపీలను మాత్రమే ఉంచుకోవాలి. విద్యార్థులు వేరే మంచి అవకాశం వస్తే వెళ్ళిపోతారనే భయంతో, వారిని బంధించడానికి కళాశాలలు ఈ అక్రమ మార్గాన్ని ఎంచుకుంటున్నాయి. ఒకవేళ మీ సర్టిఫికెట్లను కళాశాల యాజమాన్యం తిరిగి ఇవ్వడానికి నిరాకరిస్తే, విద్యార్థులు భయపడాల్సిన అవసరం లేదు. ముందుగా కళాశాల అనుబంధంగా ఉన్న యూనివర్సిటీ హెడ్‌కు ఫిర్యాదు చేయాలి. అక్కడ ఫలితం లేకపోతే నేరుగా ఖ+జకి ఆన్‌లైన్ లేదా మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. నిబంధనలు ఉల్లంఘించే కళాశాలలపై గుర్తింపు రద్దు చేయడం, గ్రాంట్లు నిలిపివేయడం వంటి కఠిన చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది. అవగాహన లోపం వల్ల చాలా మంది తల్లిదండ్రులు కాలేజీల వేధింపులకు లొంగిపోతున్నారు. చట్టంపై అవగాహన కలిగి ఉండటం, ధైర్యంగా ఫిర్యాదు చేయడం ద్వారా మీ హక్కులను కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.